# ఉగాది

- వారణాసి నాగలక్ష్మి

ఎన్నేళ్ళయినా ఉగాదిని మర్చిపోలేను. నాలుగేళ్ళక్రితం ఉగాది రోజు........

ఉగాది రోజు... సంధ్యాసమయం... చిన్న టీపాయ్ మీద కావలసిన వస్తువులన్నీ అమర్చుకొని తీరిగ్గా సాయంకాలాన్ని ఆస్వాదించాలని బాల్కనీలో కూర్చున్నా. నా దినచర్య ప్రతిరోజూ దాదాపు ఒకేలాగా వుంటుంది. పిల్లలిద్దరూ పెద్దవాళ్ళయిపోయి ఎవరిగూళ్ళు వాళ్ళు ఏర్పరచుకున్నారు. ఏమిటో వివరించలేని స్తబ్దత, ఒంటరి తనం ఆవరించుకున్నాయి. ఇంతపెద్ద అపార్ట్‌మెంట్లో ఒక గదిలోంచి, మరోగదిలోనికి వెళుతుంటే నువ్వు ఒంటరి దానివి. 'నువ్వు ఏకాకివి' అని గదిగోడలు అరుస్తున్నట్టని పిస్తోంది. ఇదివరకు ఎపుడూరాని ఆలోచనలు మనసుని మెలిపెడుతున్నాయి. రాత్రి పదింటికి గాని ఇల్లు చేరని మనిషి, తెల్లవారకుండానే పనులన్నీ ముగించుకొని ఎనిమిది గంటలకల్లా ఇల్లు విడిచి పోతూంటే ఏ విధంగానూ ఆయనలో మార్పు తేలేని నా నిస్సహాయత మొదట్లో కన్నీళ్ళు తెప్పించేది. అదంతా కొత్తలోనే లెండి. తర్వాత్తర్వాత 'మారేజ్ ఈజ్ మ్యూచువల్ ఎడ్జస్ట్‌మెంట్' అనే ఊహకలవాటు పడిపోయాను.

ఇన్నేళ్ళూ హనీమూన్‌కీ, సైట్‌సీయింగ్‌లకీ తేడా తెలీని వ్యక్తితో ఏ ఒడుదుడుకులూ లేకుండా 'సరళ అదృష్టవంతురాలు' అని నలుగురూ అనుకునేలా, 'రొటీన్'గా గడిచిపోయాయి.. పిల్లల హోంవర్కులు, పరీక్షలూ,సెలవులూ,చిన్నచిన్న అనారోగ్యాలూ వగైరాలతో సంవత్సరాలు గడిచిపోయాయి. పిల్లలు పెద్దవాళ్ళయి ఒకడు స్టేట్స్‌లోనూ, రెండోవాడు బెంగుళూరులోనూ స్థిరపడ్డారు. అపుడపుడు కుటుంబాలతో వాళ్ళు రావడం, కొద్దిరోజులు సరదాగా గడపడం, వాళ్ళు వెళ్ళాక అంతా మామూలు!

చిన్నప్పుడు ఎక్కువ చదువుకోలేదు. ఏ చేతిపని లోనూ ప్రవేశమూ లేదు... శ్రద్ధాలేదు. పాతికేళ్ళ వయసులో చదవాలని అనిపించిన నవలలు ఇపుడు మరీ చప్పగా అనిపించి చదవలేకపోతున్నాను. పక్క అపార్ట్‌మెంట్లో 'మామి'లాగా పూర్తిగా భగవధ్యానంలో గడపనూలేను !

చిన్నబ్బాయి వచ్చినపుడల్లా 'ఏదైనా చెయ్యాలమ్మా నువ్వు.. ఈ అనాసక్తత మంచిది కాదు' అంటాడు. పనిలేక పోవడం వల్లే నాకీ దిగులు అని వాడి భావం!

ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూబెల్ మోగింది. తలుపు తెరిచాను. ముద్దబంతి పూవులా పసుపు పచ్చని చీరలో కళకళలాడుతూ ముప్ఫయ్యేళ్ళ స్త్రీ, ఆమె చెయ్యి పట్టుకొని నాలుగు, అయిదేళ్ళ పాప...!

"నమస్కారమండి!" అందావిడ మొహమాటంగా చూస్తూ.

"రండి లోపలికి" అన్నాను ప్రశ్నార్థకంగా.

ఆవిడ లోపలికి వచ్చి, "కూర్చోండి" అని సోఫా చూపించగానే కూర్చుంది. ప్రక్కనే పాప కూర్చుంది.



'నా పేరు జానకి అండి.... ప్రమీలగారు మీకు బాగా తెలుసుకదా.....' అంది అర్థోక్తిలో.

'.... అవునూ....' అన్నాను.

'ఆవిడా, మేము ఒకే కాంప్లెక్స్‌లో ఉంటామండి. మా పాప ఇక్కడ మీపక్క బిల్డింగ్‌లో స్వీట్ ఏంజిల్స్ స్కూల్ లో యుకెజి చదువుతోంది. మీ పై అపార్ట్‌మెంట్ లో జ్యోతిగారి దగ్గర సంగీతం నేర్పించాలని....'

'హా... ఆవిడ బాగా చెప్తారు' అన్నాను. ఇదంతా దేనికో అర్థంగాక.

'మిమ్మల్ని ఒక సహాయం అడగాలని వచ్చానండి. పాప స్కూల్ అయ్యాక మళ్ళీ ఇంటికి అంతదూరం తీసుకెళ్ళి మళ్ళీ సంగీతానికి తీసుకురావాలి.... పోనీ తిన్నగా సంగీతానికి వెళ్ళిపోవచ్చంటే జ్యోతిగారు

మ్యూజిక్ కాలేజి నుంచి ఇంటికొచ్చేసరికి నాలుగు దాటుతోంది. పాప స్కూల్ మూడున్నరకి అయిపోతుంది. నాకేమో ఆఫీసు అయిదుగంటల దాకా వుంటుంది.... వారానికి అయిదురోజులు మా ఆఫీసు. సంగీతం క్లాసులేమో వారానికి మూడు.... సోమ, బుధ, శుక్రవారాలు మిగిలిన రెండురోజులూ మా వారు వచ్చి తీసుకువెళతారు కాని, ఈ మూడు రోజుల్లోనూ, జ్యోతి గారు వచ్చి సంగీతం మొదలు పెట్టేవరకు... మీ ఇంట్లో కొద్దిసేపు....' అంటూ మొహమాటంగా ఆగిందావిడ.

'నాకు చాలా ఇబ్బందిగా అనిపించింది. ఒకరోజా... రెండు రోజులా?... వారానికి మూడు రోజులపాటు ఎన్నాళ్ళో ఇలా?... పాప వైపు చూశాను. బూరె బుగ్గలతో అమాయకంగా చూస్తూ ముద్దుగా కనిపించింది. 'ఇంత చిన్న పాపకి అప్పుడే సంగీతమా'? అన్నాను.

'దానికి చాలా ఇష్టం ఉందండిపాటలంటే. టాలెంట్ కూడా వుంది. ఇపుడు అశ్రద్ధ చేస్తే, మరుగున పడిపోతుంది.... ఏదీ?... శ్రావ్యా! పల్లకీ పాట పాడమ్మా... మామ్మగారు వింటారు' అంది.

'శ్రావ్య!... మంచిపేరు... మంచిగాయని అవుతుందని ముందే ఆ పేరు పెట్టారా? అంటూ నేను కూడా పాడమని అడిగాను. కొంచెం సేపు గారాలు పోయి చివరికి పాడింది. గొంతులో శ్రావ్యత వుంది. గమకాలు పట్టుకునే నేర్పూ కనిపించింది.

చాలా బావుందని మెచ్చుకున్నాను. పాట వింటున్నంతసేపు ఆలోచిస్తూ ఉన్నాను. ఇదొక ఆబ్లిగేషన్ అవుతుందా ఏమిటా అని చివరికి 'ఎపుడు కష్టమనిపిస్తే అపుడే చెపుదాంలే' అనిపించింది. 'బాగా పాడింది మీపాప. స్కూలు నుండి మా ఇంటికి వచ్చేయమని చెప్పండి. క్లాసు అయ్యేసరికి మీ ఆఫీసు అయిపోతుంది. ఇద్దరికీ వీలుగా వుంటే కంటిన్యూ చెయ్యచ్చు' అన్నాను.

చాలా సంతోషపడి "థాంక్స్" చెప్పిందావిడ.

కొద్దిసేపు కూర్చుని వాళ్ళు వెళ్ళిపోయారు. తర్వాత మంచిరోజు చూసుకొని సంగీతం ప్రారంభించారు. వారంలో ప్రతి సోమవారం, బుధవారం, శుక్రవారం శ్రావ్య మా ఇంటికి వచ్చేది. సాయంత్రం మూడు ముప్పై అయిదుకల్లా బెల్ మోగేది. తీసేలోపల మూడు సార్లుమ్రోగేది. మొదట్లో విసుకున్నాను మనసులో... నిశ్శబ్దం అలవాటైపోయి అలా విసుగు అనిపించింది కాబోలు... 'వాళ్ళమ్మ చెప్పి వుండదు అలా పదేపదే కొట్టకూడదని....నేనయినా చెప్పాలి' అనుకుంటూ తలుపు తెరిచేసరికి తళుక్కుమనే కళ్ళు, మెరిసే నవ్వుతో.... 'మామ్మగారూ! మామ్మగారూ! మరేం' అంటూ - ఆగలేనట్టు స్కూల్లో ఏమయిందో దారిలో ఏం కనిపించిందో హడావుడిగా చెప్పడం మొదలు పెట్టేది.

కొద్ది రోజుల తర్వాత ముందు రోజు చెప్పినవి కూడా ప్రాక్టీసు చెయ్యటం కూడా మొదలుపెట్టింది. కంఠం శ్రావ్యంగా ఉండడంతో వినడానికి ఇంపుగా ఉండేది. మామ్మగారూ! ఇలాగేనా? అని అడుగుతూ ఉండడంతో నాకు తెలియకుండానే నేనూ శ్రద్ధగా వినడం మొదలు పెట్టాను.

నెలరోజులు దాటేసరికి శ్రావ్యరాక నా దినచర్యలో అత్యంత ప్రధానాంశంగా అయిపోయింది. ఆ మాటల కోసం, ఆతళుకు కళ్ళకోసం ఎంతగా ఎదురు చూడడం మొదలుపెట్టానంటే మంగళవారం, గురువారం ఏమీ తోచేది కాదు.

రానురాను శ్రావ్యతో పాటు నేనూ శ్రావ్యసంగీతం క్లాసు అయ్యేవరకు జ్యోతి ఇంటికి కూడా వెళ్ళడం మొదలుపెట్టాను. కర్ణాటక సంగీతంలో జ్యోతికి మంచి ప్రవేశం ఉంది.. కానీ ఎపుడూ ఇంతగా సంగీతం వినడం, దాని గురించి ఆలోచించడం అలవాటు లేక దానిలోని అందచందాలుతెలియకుండా వుండిపోయాను. ఇపుడు శ్రావ్యతో పాటుగా కూర్చోవడంతో మిగిలిన పెద్దపిల్లలు పాడే కీర్తనలూ, వర్ణాలు, మధ్యమధ్యలో లలితగీతాలూ, జానపదగీతాలూ విని విని ఇంటికి వచ్చాక కూడా ఆ సంగతులు నోట్లో నానేవి. ఎంత రసహీనమైన వాక్యమైనా రాగం కూర్చి పాడేసరికి ఎంతగా రసాలూరుతుందో అని ఆశ్చర్యపోయేదాన్ని! అందులోనూ నేటి మోడర్న్ మ్యూజిక్‌తో పోల్చి, భావానికి తగిన రాగం కూర్చి ఒకో గీతాన్ని ఒకో కావ్యంతో సమానంగా తయారుచేసిన సంగీతకారుల ప్రతిభని, సాంప్రదాయ సంగీతాన్ని తలుచుకొని సంభ్రమానికి లోనయ్యేదాన్ని. ఇంట్లో పనులు చేసుకుంటూ నాకు నచ్చిన కృతులు టేప్‌రికార్డర్‌లో వింటుంటే ఒంటరితనం తెలిసేదికాదు. శృంగార భక్తిరసాలు నిండిన కీర్తనలు సముద్రతరంగాల్లా ఎగసెగసి పడడం, తాత్త్విక కీర్తనలు సమతలం మీది నదుల్లా శాంతంగా సాగడం నాకు చాలా నచ్చేది. 'ఎంత మాధుర్యాన్ని కోల్పోయాను ఇన్నాళ్ళూ! పోన్లే ఇప్పటికైనా మేలుకున్నాను' అనుకునేదాన్ని.

మళ్ళీ ఉగాది వచ్చింది.... శ్రావ్య వచ్చింది.... వస్తూనే

కొత్తబట్టలతో నాకు నమస్కారం పెట్టింది. వాళ్ళమ్మ, జ్యోతికీ, నాకూ ఉగాది శుభాకాంక్షలు చెప్పి, స్వీట్స్ ఇచ్చిపోవడానికి వచ్చింది. ఇద్దరూ కూర్చున్నారు.

“మామ్మగారూ.... ఇవాళ్టినుంచి నేను సంగీతం టీచర్.... మీరేమో స్టూడెంట్.... నాకొచ్చినవన్నీ మీకు ఊరికే నేర్పిస్తా..... డబ్బులివ్వక్కరలేదు.....“ అంది నాకు చాలా ముద్దొచ్చింది. ఈ మధ్య శ్రావ్య కోసం ఏవేనా చిన్నచిన్న టిఫిన్లు చేయడం. ఇద్దరు కలిసి తినడం అలవాటైపోయింది. పండగ కోసం చేసిన తీపి పూరీలు రెండు ప్లేట్లలో తెచ్చి, ఇద్దరికీ ఇచ్చాను. చాలా ఇష్టం కాబోలు.... తళతళలాడే కళ్ళతో నావైపు చూసి “ఇలా ఏవైనా పెడుతుంటారు కదా!... అదే ఫీజన్నమాట!“ అంది. మళ్ళీ నవ్వువచ్చింది. శ్రావ్య ఏంమాట్లాడినా ఆ వయసు తాలూకు అమాయకత్వం కనిపించి నవ్వొస్తోంది. ముద్దుగా అనిపిస్తోంది.

“సరే“ అన్నాను.

తినేసి, సీరియస్‌గా వాళ్ళ టీచర్‌లా కూర్చుని, “సా....పా....సా.... శృతి పట్టండి మామ్మగారూ“ అంది.

“సా....పా....సా...“ అన్నాను అప్రయత్నంగా.

“కరెక్ట్.... అలాగే అనాలి“..... “చాలా స్వీట్‌గా అన్నారే మీరు......“ అంది.

వాళ్ళమ్మ “నిజంగానే మీగొంతు చాలా బావుందండీ“ అంది.

అదే మొదలు...! తర్వాత జ్యోతి దగ్గర సంగీతం పాఠాలకి వెళ్ళడం శ్రావ్యతో పాటుగా...... ఇద్దరం కలిసి పాడుకోవటం మొదలైంది. ఇన్నేళ్ళకి ఓ కొత్త ద్వారం తెరుచుకొని కొత్తలోకాన్ని చూస్తున్న అనుభూతి కలిగింది. అంతే..... జీవితంలో ఎంతమార్పు! ఎన్నేళ్ళయినా ఆ ఉగాదిని మర్చిపోలేను!

## ‘ఉగాది‘కి స్వాగతం

**- కోవెల వసుధ**

మావిచిగురు తొడిగేవేళ
మల్లెమొగ్గ విచ్చుకునేవేళ
మంచుబిందువులు తప్పుకునేవేళ
మది ఆనందంతో చిందులేసేవేళ
పలుకుదాం ఉగాదికి స్వాగతం!!

చిరుజల్లు రాకతో పుడమి పులకరించేవేళ
చిన్నబుచ్చుకున్న చెట్లు చిగురేసేవేళ
అవని పచ్చదనంలో పలకరించేవేళ
ఆమని క్రొత్త అందాలతో విరబూసేవేళ
పలుకుదాం ఉగాదికి స్వాగతం!!

పక్షుల కిలకిలా రావాలతో ప్రకృతి పరవశించేవేళ
కోయిల పాటలో గొంతు కలిపి కూనిరాగం తీసేవేళ
మామిడి తోరణాలతో తలుపులు అలరించేవేళ
రంగురంగుల ముగ్గులతో ముంగిళ్ళు రంజిల్లువేళ
పలుకుదాం ఉగాదికి స్వాగతం!!

ఉగాది పచ్చడి షడ్రుచులతో
పిండివంటల ఘుమఘుమలతో
పండితుల పంచాంగ శ్రవణాలతో
పెద్దచిన్న చేసికొనే సంబరాలతో
పలుకుదాం ఉగాదికి స్వాగతం!!

పలుకుదాం నవజీవనానికి నాంది
కలుపుదాం విరోధితో స్నేహం
పలుకుదాం ఉగాదికి స్వాగతం
పలుకుదాం నవయుగాదికి స్వాగతం!!

*Best Compliments From*

TEL: (201) 433-8002

**VINLABA GREENVILLE PHARMACY INC.**
1850 Kennedy Boulevard
Jersey City, NJ 07305

**GOPAL K.DARISIPUDI M.S. R.Ph**
President

Harini INDIAN CUISINE

***Nalini Bonthu-Kottana***
*itsmenalini@yahoo.com*
**HARINI FOODS LLC**
**OFFICIAL CATERERS FOR BRIDGEWATER TEMPLE, NJ**
3349 Brunswick Pike #66, Mercer Mall
Lawrenceville, NJ 08648
ph: 609-750-0488, fax: 609-750-0888
Web : www.harinirestaurant.com